స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు వర్గీకరించాలి

రజక వృత్తిదారుల సంఘం ప్రధానకార్యదర్శి ఆశయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేతివృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయకపోవడం వల్ల 100కుపైగా ఉన్న వెనుకబడిన తరగతులకు న్యాయం జరగడం లేదన్నారు. బీసీలకు సంబంధించిన విద్యా, ఉద్యోగ అవకాశాల్లో వర్గీకరించినట్లుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా రిజర్వేషన్‌లలో వర్గీకరణ పాటించకపోవడం వల్లే సేవా, సంచార వృత్తి కులాలు రాజకీయంగా ఎదగలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ భాగయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌ల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధిగా వ్యవహరించాలని కోరారు. న్యాయస్థానాలు కూడా అనేక సార్లు వర్గీకరణ చేపట్టాలని సూచించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జొర్రీగల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శన్, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.వి.రమణ, వివిధ సంఘాల ప్రతినిధులు విఘ్నేష్, వెంకటకృష్ణ, కుమార స్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

'మృగశిర'ను చేపలపండుగగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లెల్లల బాలకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మృగశిర కార్తెను చేపలపండుగగా నిర్వహించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది చేప, రొయ్యపిల్లల పంపిణీ టెండర్ల విధానం కాకుండా మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం ఆధ్వర్యంలో సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి చేపలు, రొయ్యల పంపిణీ టెండర్లలో జరిగిన అవినీతిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి గాను ప్రభుత్వం మత్స్యశాఖ మంత్రిని నియమించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొప్పు పద్మ, మురారి మోహన్, శంకర్, అమరావతి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


నర్సింహబస్తీలో పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట నర్సింహబస్తీలోని పోచమ్మ అమ్మవారి ఆలయ 13వ వార్షికోత్సవం గురువారం నేత్ర పర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చక స్వాములు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో బస్తీ, ఆలయ కమిటీ సభ్యులు ఎం.భూపతినాథ్, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

కరాటే గ్రాండ్‌మాస్టర్ కృష్ణకు సత్కారం

కాచిగూడ: మలేషియాలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ గోజు–రైయు–ఐపో సిటీ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో మెరిట్ గోల్డ్ మెడల్ సాధించిన యమగుచ్చి కరాటే ఇంటర్నేషనల్ గ్రాండ్‌మాస్టర్ ఆర్.కె.కృష్ణను వైఎంసీఏ గ్రేటర్ ప్రధానకార్యదర్శి ప్రిస్టిలీ గైస్, కరాటే విద్యార్థులు అభినందించారు. నారాయణగూడ వైఎంసీఏలో గురువారం జరిగిన ఆర్.కె.కృష్ణ అభినందన సత్కార కార్యక్రమంలో బీజే వినయ్ స్వరూప్, కె.కృష్ణ, రోహిత్, అనన్య, నందిని తదితరులు పాల్గొన్నారు.


కృష్ణను అభినందిస్తున్న ప్రిస్టిలీ గైస్ తదితరులు


కోల్‌కతా హైకోర్టు తీర్పుపై సంబరాలు


జ్యోతిరావుపూలే చౌరస్తాలో చేపట్టిన కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

అంబర్‌పేట: మతప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించడాన్ని బీజేపీ తప్పు పడుతూ వస్తోందని, అదే విషయాన్ని కోల్‌కతా హైకోర్టు స్పష్టం చేయడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మతప్రాతిపదికన ముస్లింలను ఓబీసీలో చేరుస్తూ రిజర్వేషన్‌లు కల్పించడాన్ని కలకత్తా కోర్టు రద్దు చేయడం శుభపరిణామమని అన్నారు. అక్కడి హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం అంబర్‌పేట జ్యోతిరావు పూలే విగ్రహం చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మణ్ మట్లాడుతూ మతప్రాతిపదికన రిజర్వేషన్‌లను బీజేపీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇండియా కూటమి పార్టీలు చేస్తున్న ఆగడాలను ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, నాయకులు పూస రాజు, దివాకర్, కృష్ణగౌడ్, సంజయ్, శ్యామ్‌రాజ్, వినోద్‌యాదవ్, కార్పొరేటర్‌లు కన్నె ఉమారమేశ్‌యాదవ్, అమృత, నాయకులు మల్లేశ్, చిట్టి శ్రీధర్, ఎక్కాల కన్నా, వెంకటేష్‌గౌడ్ తదితరుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మమతాబెనర్జీ వైఖరిపై నిరసన

ముషీరాబాద్: మతపరమైన రిజర్వేషన్లపై పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించనని పేర్కొన్న ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు రాష్ట్రపతిని కోరారు. మమత బెనర్జీ వైఖరిపై ముషీరాబాద్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఉమేష్ ఆధ్వర్యంలో గురువారం అడిక్‌మెట్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కూడా మతపరమైన రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పి.ఎస్.చారి, కె.రాజు, రంగరాజుగౌడ్, గౌరీశంకర్, నందు, శేషసాయి, కాడబోయిన నర్సింగ్‌రావు, సాయికృష్ణయాదవ్, డివిజన్ అధ్యక్షులు ఆర్.నరేష్, సాయిచందు, నాయకులు రమేష్‌గౌడ్ వీరస్వామి, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యంబాబు, సుజాత పాల్గొన్నారు.


పూలే విగ్రహం వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న పూస రాజు, ఉమేష్ తదితరులు

బీసీల ప్రతిఘటన తప్పదు

ప్రభుత్వానికి దాసు సురేష్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులగణన లేకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే బీసీల ప్రతిఘటన తప్పదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్‌ల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో అఖిలపక్ష బీసీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్‌ల పెంపు కోసం బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎమ్మెల్సీలు పార్టీలకు అతీతంగా గళం విప్పాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీలకు 12 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రిజర్వేషన్‌లపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలెవరూ ఓట్లు వేయరన్నారు. బహుజన సామాజికవేత్త వీజీఆర్ నారగోని మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లపై తాత్సారం చేస్తే ప్రభుత్వం మూల్యం చెల్లించకతప్పదన్నారు. ఈ సమావేశంలో జాతీయ ఓబీసీ నాయకురాలు భాగ్యలక్ష్మి, జస్టిస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న శ్రీకాంత్, ఎంబీసీ నాయకుడు మీనా గోపి, వెంకటేష్ గౌడ్ మారెపల్లి లక్ష్మణ్, అడ్వకేట్ వంశీకృష్ణ, మంద వెంకటస్వామి, కొండ యాదగిరి, బందారు పద్మావతి, గోషిక స్వప్న, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత.. సా..గతీత!

- అంబర్‌పేటలో పూర్తికాని నాలా పనులు
- 17 కిలో మీటర్ల మేర ఉన్న నాలాతో ఇబ్బందులే..
- వర్షాకాలంలో ప్రజలకు తప్పని ముంపు ముప్పు
- సమ్మెలో కాంట్రాక్టర్లు.. నాలాలో పేరుకుపోయిన పూడిక
- స్పందించని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు

అంబర్‌పేట: నాలాల పూడికతీత పనులు ఇంకా పూర్తికాలేదు. వర్షం వస్తే తలెత్తే ముంపు ముప్పుపట్ల అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న నాలాల పూడికతీత పనులను వేసవికాలం ముగిసేలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఇంకా ఆ పనులు పూర్తికాలేదు. దీంతో వర్షాకాలంలో ఆయా ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ నియోజకవర్గంలో ఉన్న నాలాల్లో 60 నుంచి 70 శాతం పూడికతీత పనులే జరిగినట్లు తెలుస్తోంది. మరోవారం రోజుల్లో వర్షాకాలం రానున్న నేపథ్యంలో పూడికతీత పనులు పూర్తి కాకపోవడంతో నాలాల పరిసర ప్రాంతాల ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి వర్షాకాలంలోనూ ఇబ్బందులే...

నియోజకవర్గంలో సుమారు 17 కిలోమీటర్ల మేర నాలాలు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా మొయిన్ చెరువు, ఉస్మానియా యూనివర్సిటీ నాలాలు జనావాసాల మధ్యలోంచి వెళ్తున్నాయి. మొయిన్ చెరువు నాలా బాగ్ అంబర్‌పేట డివిజన్లోని రహత్‌నగర్, మల్లికార్జున్‌నగర్‌ల మీదుగా అంబర్‌పేట డివిజన్‌లోని ఓవైసీ నగర్, బాపునగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, ప్రేమనగర్‌ల మీదుగా మూసీలో కలుస్తుంది. పూడికతీత సరిగా చేపట్టకపోతే వైభవ్‌నగర్, బతుకమ్మ కుంట, గోల్నాక, న్యూగంగనగర్ ప్రాంతాల్లో వర్షపు నీటి ముంపు ముప్పు తలెత్తుతుంది.

పనుల్లో అవినీతి...

నాలాల పూడికతీత పనుల్లో అవినీతి ఆరోపణలు కూడా వస్తుంటాయి. మూడేళ్ల క్రితం నాలా పూడికతీత పనుల్లో అవినీతి కారణంగా కాంట్రాక్టర్లు జైలుకు వెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి. పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టకుండా బిల్లులు పెట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. విస్తరించిన నాలా పొడువునా పూడికతీత తీయకుండా కొద్దిమేర తీసి, పనులు పూర్తి అయినట్లు కాంట్రాక్టర్లు బిల్లులు విడుదల చేయించుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఏడాది చేపట్టిన నాలా పూడికతీత పనుల్లో సైతం నాణ్యతాప్రమాణాలు పాటించారో, లేదో అనుమానమే. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

సమ్మెలో కాంట్రాక్టర్లు...

వర్షాకాలం ముంచుకొస్తున్నా నాలా పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. వాటిని పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్లు సమ్మె చేస్తున్నారు. దీంతో మరింత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. నాలాలో పేరుకుపోయిన పూడికను సకాలంలో తొలగించకపోతే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవు. దీనిపై జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 ఈఈ పేరాజును సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రావడం లేదు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కిపైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 95058 00050లో సంప్రదించాలి.

జనగామకు పాపన్నగౌడ్ నామకరణంపై హర్షం


నారాయణగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జిల్లాగా నామకరణం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల అభినందనలు తెలిపారు. పాపన్నగౌడ్ నామకరణంతో గత 30 సంవత్సరాలుగా చేసిన ఉద్యమాలను గుర్తించినట్లు అయిందన్నారు. బహుజన కులాల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

31న ఫీజుల నియంత్రణపై రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ–ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జస్టిస్ చంద్రకుమార్ హాజరు కానున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి తెలిపారు.

ప్యాచ్‌వర్క్ లేక రోడ్డు అధ్వానం

షేర్ అలీ వీధిలో అవస్థలు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ షేర్ అలీ వీధిలో అధ్వానంగా మారిన రోడ్లతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏడాది క్రితం డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాత ప్యాచ్ వర్క్ చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పెంటయ్య, విజయ, రూప తదితర స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నడవడానికి సైతం వీలు లేని పరిస్థితి ఏర్పడింది. వాహనదాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేస్తే నిధులు మంజూరయ్యాయి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ రావడం లేదని పేర్కొంటున్నారని వారు తెలిపారు. సంవత్సరం పూర్తికావస్తున్నా పనులు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.


షేర్‌అలీ వీధిలో అధ్వానంగా మారిన రోడ్డును చూపిస్తున్న స్థానికులు

డాక్టర్ విజయ్‌మోహన్‌కు కామధేను అవార్డు

కాచిగూడ: వంశీ ఇంటర్నేషనల్ సోషియో, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బర్కత్‌పురకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయ్ మోహన్ 'డాక్టర్ కాకర్ల సుబ్బారావు మెమోరియల్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ కామధేను'అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా బర్కత్‌పురలోని ఆయన కార్యాలయంలో డాక్టర్ విజయ్ మోహన్ మాట్లాడుతూ వైద్యవిద్యతోపాటు రోగులకు అందిస్తున్న సేవాకార్యక్రమలను గుర్తించి తనకు ఈ అవార్డును అందించడం గర్వంగా ఉందని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇతరులు కూడా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా వారిని ప్రోత్సహిస్తానని తెలిపారు.


మురళీమోహన్ చేతుల మీదుగా కామధేను అవార్డు అందుకుంటున్న డా.విజయ్ మోహన్

'ఉస్మానియా' సమస్యలు పరిష్కరించాలి

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పీవైఎల్ వినతి

ముషీరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) డిమాండ్ చేసింది. గురువారం ఆసుపత్రి సూపరెండెంట్ బి.నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై రోగుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజూ అవుట్ పేషంట్లు భారీ సంఖ్యలో వస్తున్నందున ఫార్మసీ వద్ద ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేసినా తీవ్ర జాప్యమవుతోందని, వృద్ధులు సైతం బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో లేవని కొన్ని మందులు సగమే ఇస్తున్నారని చెప్పారు. బ్లడ్, ఇతర టెస్టులు, ఫలితాలకు ఎక్కువ రోజుల సమయం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. నూతన బిల్డింగ్ నిర్మాణం చేపడితే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ, ఉపాధ్యక్షులు కొల్లూరి భీమేష్, కొల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజారోహణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక వంశీయులు టి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వ ర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హవనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం పూర్తయిన తర్వాత భేరిపూజ, దేవతాహ్వానం, హవనం, బలిహరణం వంటి కార్యక్రమాలతోపాటు శేషవాహనసేవ జరిగింది. శుక్రవారం పల్లకీసేవ, రాత్రి హంస వాహనసేవ ఉంటుందని తెలిపారు.


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కవాడిగూడ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు సైఫాబాద్ ఏడీఈ తెలిపారు.

- ఉ. 11 నుంచి 12.30 గంటల వరకు కవాడిగూడలో మా రియెట్ హోటల్ ఎదురుగా, కవాడిగూడ పెట్రోలు పంపు ఏరియా, పద్మశాలి కాలనీ, హనుమాన్ టెంపుల్ తదితర ప్రాంతాలు.
- మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఫీడర్ పరిధిలోని నర్మాద హాస్పిటల్ ప్రాంతం, శ్రీనిధి అపార్టుమెంట్స్, గాంధీనగర్ పార్కు, విజయబ్యాంక్, హ్యాపీ హోమ్స్ అపార్టుమెంట్స్.
- మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు జగదాంబ నర్సింగ్‌హోం ఫీడర్ పరిధిలోని జగదాంబ నర్సింగ్‌హోం పరిసర ప్రాంతాలు, ఆంధ్రాకేఫ్, హెరిటేజ్ సూపర్‌మార్కెట్.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గోషాల పీడర్ పరిధిలో లోయర్ ట్యాంక్‌బండ్, రజక కాలనీ, సర్దార్‌జీ పంప్‌హౌస్, అంబేడ్కర్ భవన్ ప్రాంతం, సింగాడికుంట బస్తీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉ.11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

- రామాలయం ఫీడర్ పరిధిలో న్యూనల్లకుంట, సిండికెట్ బ్యాంక్, నరేంద్రపార్కు, రామాలయం 11 గంటల నుంచి 12.30 వరకు.
- బ్రాహ్మణ హాస్టల్ ఫీడర్ పరిధిలో బ్రాహ్మణ హాస్టల్, ఇంద్రానగర్, తిలక్‌నగర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 12.30 నుంచి 2 గంటల వరకు.
- కమలానగర్ ఫీడర్ పరిధిలో కమలానగర్, కృష్ణానగర్, శంకర్ నగర్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4 వరకు.
- సీసీఎల్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, పటేల్‌వాడా, ప్రేమ్‌నగర్, సిపిఎల్ క్వాటర్స్ తదితర ప్రాంతాల్లో 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

'జీవితంలో విజయం సాధించడం ఎలా..?' పై

రేపు సింపోజియం


కాచిగూడ: వర్ణిక ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'జీవితంలో విజయం సాధించడం ఎలా..?'అనే అంశంపై ఈ నెల 25న కాచిగూడలోని అమృత ఆర్కేడ్‌లో సింపోజియం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి, న్యాయవాది కాసుల వినోద్ తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ సింపోజియం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్ఎస్ న్యాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, ప్రత్యేక అతిథిగా హైకోర్టు న్యాయవాది కానుగు దేవేందర్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

ఘనంగా బుద్ధ జయంతి

ముషీరాబాద్: గౌతమ బుద్ధుడి 2568వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో గల బుద్ధుడి విగ్రహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శిరిగిరి శ్యామ్ నివాళులు అర్పించారు. బోధిసత్వ భగవాన్ బుద్ధగా ప్రపంచ చరిత్రలో నిలిచిపోయి సామ్రాట్ అశోక్ చక్రవర్తి, బాబా సాహెబ్ అంబేడ్కర్‌లకు మార్గం చూపిన మహాబోధకుడని, ఆచరణాత్మక విప్లవకారుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకం సత్యనారాయణ, జంగం అరుణ్, అరవింద్, ఔట వెంకేటష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భక్తిశ్రద్ధలతో చండీహోమం


శారదాంబను పూలతో అలంకరించి పూజలు నిర్వహించిన దృశ్యం


శంకరమఠంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నల్లకుంట శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు కావించిన అర్చక స్వాములు చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదాంబకు విశేషపూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుల మంత్రోచ్ఛారణల నడుమ భక్తి శ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు.

మూసివేత దిశగా సంక్షేమ హాస్టళ్లు

ఆర్.కృష్ణయ్య ఆందోళన

కాచిగూడ: రెండేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ భవనాల అద్దె బిల్లులు చెల్లించకుండా వాటిని మూసివేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 10 నెలలుగా మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లకు సప్లయ్ చేసే నిత్యావసర వస్తువులు, కూరగాయలు, నూనెలు పప్పులు, చికెన్, గుడ్లు, ఇతర ఆహార దినుసులను వ్యాపారులు నిలిపివేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో 700 బీసీ, 1,500 ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉండే 8 లక్షల మంది విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆ యన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేయా లని ఉప ముఖ్యమంత్రికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నా రు. రాష్ట్రంలోని 295 బీసీ కాలేజీ హాస్టళ్లు, 321 గురుకుల పాఠశాలల్లో ఒకదానికి కూడా సొంత భవనంలేదని విచారం వ్యక్తం చేశారు. వా రం రోజుల్లోగా బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందో ళ న కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్లను, సచివాలయాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు.